

# పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ స్నేహా శబరిష్

**మహబూబాబాద్, జులై 3(ప్రభాత గమనం):**

జిల్లాలోని కళాశాలలు, పాఠశాలల్లో, కె.జి.బి.వి లలో మౌలిక వసతుల పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని, కళాశాలలు, అంగన్‌వాడీ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని, రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం లోని లబ్ధిదారుల వివరాల నివేదికలను ఇవ్వాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సంబంధిత అధికారులతో అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కళాశాలల్లో , పాఠశాలల్లో, కె.జి.బి.వి లలో డ్రింకింగ్ వాటర్, టాయిలెట్, కరెంట్ వంటి పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో పలు మండలాల్లో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాల లబ్ధిదారుల వివరాల నివేదికలను ఇవ్వాలని, లబ్ధిదారులకు నాణ్యమైన గృహాలు త్వరితగతిన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వివిధ దశలలో ఉన్న నిర్మాణాల వివరాలను ఇవ్వాలని అన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను గుర్తించి ఇంటర్‌లో చేర్పించాలని, డ్రాప్ అవుట్స్ లేకుండా చూడాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ (ఇంచార్జ్), జెడ్.పి సీ.ఈ.ఓ పురుషోత్తం, హౌసింగ్ ఈ.ఈ, డి.ఈ.ఓ సత్యనారాయణ, ఇంచార్జ్ డి.డబ్ల్యూ. ఓ శిరీష పాల్గొన్నారు.



# తీరిన చైతన్య నగర్ తాగునీటి కష్టాలు

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ కు కాలనీవాసుల కృతజ్ఞతలు

**కేసముద్రం జూలై 03 (ప్రభాత గమనం):**

మండల కేంద్రంలోని చైతన్య నగర్ కాలనీ వాసుల దీర్ఘకాలిక తాగునీటి కష్టాలు తీరనున్నాయి. కాలనీలో స్వచ్ఛమైన తాగునీరు అందక ప్రజలు పడుతున్న ఇబ్బందులపై గతంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్ నేతృత్వంలో చైతన్య నగర్ కాలనీ వాసులు మరియు మాజీ ఎంపీటీసీ కొమ్ము స్వాతి రాహుల్ కలిసి జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన, కాలనీకి మినరల్ వాటర్ ప్లాంట్ మంజూరు చేయించడంతో ప్రస్తుతం అక్కడ వాటర్ ప్లాంట్ పనులు శరవేగంగా ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్ నేతృత్వంలో చైతన్య నగర్ కాలనీ వాసుల బృందం, మాజీ ఎంపీటీసీ కొమ్ము స్వాతి రాహుల్, వళ్ళందాస్ మహేష్, పెండ్యాల రవికుమార్ తదితరులు హైదరాబాద్‌లోని జాటోతు హుస్సేన్ నాయక్ నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

**- ఎన్టీఆర్ కాలనీకి కూడా వాటర్ ప్లాంటు ఏర్పాటుకు హామీ**

ఇదే తరుణంలో మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీ వాసులు సైతం స్వచ్ఛమైన తాగునీరు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని నాయకులు హుస్సేన్ నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. చైతన్య నగర్ తరహాలోనే ఎన్టీఆర్ కాలనీకి కూడా ఒక మినరల్ వాటర్ ప్లాంట్ మంజూరు చేయాలని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ, ఎన్టీఆర్ కాలనీలో కూడా త్వరలోనే వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు హామీ ఇచ్చారని బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

# నో హెల్మెట్.. నో ఎంట్రీ!

- ఆ గ్రామాల్లోకి వెళ్లాలంటే హెల్మెట్ ఉండాల్సిందే!
- పోలీసుల పిలుపునకు అద్భుత స్పందన
- గార్ల మండలంలోని 3 గ్రామాల్లో వినూత్న నిర్ణయం
- గ్రామ కూడళ్లలో ఫ్లెక్సీల ఏర్పాటు




**గార్ల, జులై 3 (ప్రభాత గమనం) :**

"ప్రాణం కంటే హెల్మెట్ బరువైంది కాదు..."ఇదే ఇప్పుడు ఆ గ్రామాల నినాదం. బైక్ ఉండి తలపై హెల్మెట్ లేకపోతే ఆ గ్రామాల్లోకి ప్రవేశం నిషిద్ధం. రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీస్ శాఖ తీసుకువచ్చిన ఒక మంచి కార్యక్రమం, ప్రజల్లో ఊహించని మార్పుకు శ్రీకారం చుట్టింది. గార్ల మండలంలో ఇప్పుడు ఒక సరికొత్త విప్లవం నడుస్తోంది. మండల పరిధిలోని గోపాలపురం, పినిరెడ్డి గూడెం, కోట్యా నాయక్ తండా గ్రామాల్లో అడుగుపెట్టాలంటే ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి చేశారు.ఇటీవల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈ గ్రామాల్లో "అరైవ్ - అలైవ్" అనే రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసుల పిలుపునకు ఆయా గ్రామాల పాలక వర్గాలు, గ్రామ పెద్దలు చొరవ తీసుకున్నారు. కేవలం అవగాహనతో సరిపెట్టకుండా, ప్రాణ రక్షణే ధ్యేయంగా "హెల్మెట్ లేనిదే గ్రామాల్లోకి ప్రవేశం లేదు" అనే కఠినమైన రూల్‌ను అమలుల్లోకి తెచ్చారు. ఈ మేరకు గ్రామాల నడిబొడ్డున హెచ్చరిక ఫ్లెక్సీలను కూడా ఏర్పాటు చేయడం విశేషం.ఈ వినూత్న నిర్ణయంపై గార్ల సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) సాయికుమార్ మాట్లాడుతూ గ్రామస్తుల నిర్ణయాన్ని అభినందించారు."చాలామంది ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించని కారణంగానే రోడ్డు ప్రమాదాల్లో తలకు తీవ్ర గాయాలై ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే 'గోల్డెన్ అవర్' (తొలి గంట)లో సరైన చికిత్స అందక ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. హెల్మెట్ ధరిస్తే ఇలాంటి ప్రాణాపాయాల నుండి 90 శాతం బయటపడవచ్చు" అని ఆయన వివరించారు.గ్రామస్తులు స్వచ్ఛందంగా తీసుకున్న ఈ నిర్ణయానికి పోలీసులు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నారు. ఇకపై ఈ పరిధిలో హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే మోటార్ వాహన చట్టం నిబంధనల ప్రకారం భారీగా అపరాధ రుసుం విధిస్తామని ఎస్ఐ సాయికుమార్ హెచ్చరించారు.

# భూ సమస్యల పరిష్కారానికే రీ సర్వే..

- జిల్లా భూకొలతల సర్వే ల్యాండ్ సహాయ సంచాలకులు సహెచ్ శ్రీనివాసులు

**మహబూబాబాద్, జూలై 03 (ప్రభాత గమనం) :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ-సర్వే (భూ భారతి) ప్రక్రియపై జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో అధికారులు ప్రజలకు మరియు రైతులకు అవగాహన సదస్సులు (గ్రామసభలు) నిర్వహిస్తున్నారని, ఎంతో కాలంగా నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం భూముల రీ సర్వే కార్యక్రమం చేపట్టిందని జిల్లా భూకొలతల సర్వే ల్యాండ్ సహాయ సంచాలకులు సి.హెచ్ శ్రీనివాసులు తెలిపారు. దీనిలో భాగంగా శుక్రవారం జిల్లా లోని వివిధ మండలాలలో భూ భారతి - భూముల రీ సర్వేపై అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి అవగాహన సదస్సులు నిర్వహించారు. ప్రభుత్వం జిల్లాలో 70 గ్రామాలు రీ సర్వే జరుపుటకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారని దానిలో భాగంగా రీ సర్వే పై అవగాహన కల్పించుటకు గ్రామ సభలు నిర్వహించుట జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రీ సర్వే ద్వారా ప్రతి రైతుకు సర్వే నెంబర్ నమోదుచేసి (ల్యాండ్ పార్శల్ మ్యాప్ ), భూమి కమతాన్ని ఆన్లైన్లో పొందుపరుస్తామని, గతంలో జరిగిన సర్వేలో తప్పులు జరిగి ఉంటే రీ సర్వేలో సరిచేసుకోవచ్చని ఎలాంటి వివాదాలు లేకుండా చేసి భూమికి భూధార్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సర్వేని



ర్వహించే తేదీల్లో రైతులు అందుబాటులో ఉండి ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞ ప్తి చేశారు. రీ సర్వే ద్వారా గ్రామ, భూ సరిహద్దులు, ప్రభుత్వ భూములు, చెరువులు, కాల్వలు, రహదారులతో పాటు ఇతర ప్రజా అవసరాల భూములను కచ్చితంగా రీ సర్వే చేయను న్నట్లు తెలిపారు. రీ సర్వే కార్యక్రమం ప్రజలకు మెరుగైన భూ హక్కులను కల్పించేందుకు ఉద్దేశించిందని ప్రజల సహకారం తప్పనిసరి అని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గడువు ముగిసిన విత్తనాల విక్రయం

- కేసముద్రంలో రమ్య ఏజెన్సీస్ విత్తనాల సీజ్
- రైతు ఫిర్యాదుతో కదిలిన వ్యవసాయ శాఖ అధికారులు
- మూడు ప్యాకెట్లు, స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్కులు స్వాధీనం



**కేసముద్రం, జూలై 03(ప్రభాత గమనం):**

అన్నదాతల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని గడువు ముగిసిన నకిలీ, కాలం చెల్లిన విత్తనాలను అంటగడుతున్న వ్యాపారుల ఆటకట్టించారు కేసముద్రం మండల వ్యవసాయ అధికారి (ఏఓ) బి. వెంకన్న. గడువు ముగిసిన హైబ్రిడ్ మొక్కజొన్న విత్తనాలను విక్రయించిన "రమ్య ఏజెన్సీస్" లో విత్తనాలను శుక్రవారం అధికారులు సీజ్ చేశారు.ఓ రైతు ఈనెల 1వ తేదీన రమ్య ఏజెన్సీస్‌లో మొక్కజొన్న విత్తనాలు కొనుగోలు చేశారు. అయితే, సదరు డీలర్ రైతుకు పయనీర్ కంపెనీకి చెందిన 'పి3302' రకం హైబ్రిడ్ మొక్కజొన్న విత్తనాలను విక్రయించాడు. కాగా, ఈ విత్తనాల గడువు ఈ ఏడాది ఫిబ్రవరి 23, 2026 నాడే ముగిసిపోయింది. గడువు ముగిసిన విత్తనాలను తనకు విక్రయించి మోసం చేశారంటూ బాధితుడు శుక్రవారం మండల వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేశాడు.రైతు ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన ఏఓ బి. వెంకన్న తన సిబ్బందితో కలిసి ఉప్పరపల్లి క్రాస్ రోడ్డులోని రమ్య ఏజెన్సీస్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో షాపులో నిల్వ ఉంచిన మరో మూడు గడువు ముగిసిన విత్తన ప్యాకెట్లను అధికారులు గుర్తించారు. దీనితో పాటు విత్తన చట్టం 1966 నిబంధనల ప్రకారం సదరు షాపులోని స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్కులను స్వాధీనం చేసుకుని, స్థానికుల సమక్షంలో పంచనామా నిర్వహించారు. అనంతరం విత్తనాలను పూర్తిగా సీజ్ చేశారు."రైతులను మోసం చేస్తూ గడువు ముగిసిన విత్తనాలు విక్రయిస్తే సహించేది లేదన్నారు. రమ్య ఏజెన్సీస్‌పై విత్తన చట్టం ప్రకారం చర్యలు తీసుకున్నామని తెలిపారు. సదరు విత్తన షాపు లైసెన్సును రద్దు చేయాలని, డీలర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా ఉన్నతాధికారులకు పూర్తి నివేదికను పంపానని తెలిపారు. రైతులు కూడా విత్తనాలు కొనేటప్పుడు ప్యాకెట్లపై గడువు తేదీలను (ఎక్స్ పైరీ డేట్) గమనించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు."

# అన్నపూర్ణ క్యాంటీన్, పబ్లిక్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలి

-కంచ వెంకన్న డిమాండ్

**కేసముద్రం, జులై 3 (ప్రభాత గమనం):**

కేసముద్రం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్, బ్రహ్మంగారి గుడి సెంటర్ లో ఐదు రుపాయల అన్న పూర్ణ క్యాంటీన్ లను, పబ్లిక్ టాయిలెట్లను వెంటనే ఏర్పాటు చేయాలని ఎంసిపిఐయు పార్టీ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు కేసముద్రం మండల కేంద్రంలోని జ్యోతిరావు పూలె సెంటర్లో ఎంసిపిఐయు, ఎఐసిటియు కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు .కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రానికి 40 గ్రామాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం వచ్చిపోతుంటారని కానీ మున్సిపాలిటీ కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడంతో మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఇట్టి విషయాన్ని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చామని అయిన ఫలితం లేదన్నారు.ప్రభుత్వం ఏమాత్రం నిర్లక్ష్యం వహించిన ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.అదే విధంగా మున్సిపాలిటీ కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ బ్రహ్మంగారి గుడి సెంటర్లలో ఐదు రూపాయల అన్నపూర్ణ క్యాంటీన్ లు ఏర్పాటు చేయాలని దీని మూలంగా ప్రయాణికులు కార్మికులు పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని దీనిని అమలు చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం




వీటి అమలులో నిర్లక్ష్యం వహించిన వీటి సాధన కొరకు ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో గంద్రకోటి యాకయ్య, జిల్లా కమిటీ సభ్యులు బొల్లోజు రామ్మోహన చారి, కార్మిక సంఘ నాయకులు ఎం.డి. హబీబ్, ఏ. శ్రీకాంత్, పందుల ఎల్లమ్మ, వల్లందాస్ పుష్ప, ఈదునూరి బుచ్చమ్మ, వల్లందాస్ భాగ్యమ్మ, కొమ్ము కలమ్మ, వల్లందాస్ ఊర్మిళ, ఇరుగు ఎల్లమ్మ,వల్లందాస్ రేణుక, కొంగర జమున, పందుల మల్లమ్మ, బర్ల అనసూర్య, కొంగరి పద్మ, గడ్డం భూలక్ష్మి , సగురం పూలమ్మ, మామిండ్ల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో మరింత పురోగతి సాధించాలి

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ జులై 3(ప్రభాత గమనం):**



ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిజమైన అర్హులైన నిరుపేదలకు పక్కా ఇళ్లు అందేలా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. శుక్రవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై గృహ నిర్మాణ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు తొలి ప్రాధాన్యతనిస్తూ అర్హులను ఎంపిక చేయాలని తెలిపారు. మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేస్తూ గ్రౌండింగ్, బేస్‌మెంట్, రూఫ్ దశల వారీగా పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ మాత్రు నాయక్, డిఈలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.



# రంగాపురం గ్రామంలో భూ రీ సర్వే..

కేసముద్రం జులై 3(ప్రభాత గమనం): మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం రంగాపురం గ్రామపంచాయతీ కార్యాలయం నందు భూముల రీ-సర్వే గురించి అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి భూ రికార్డుల కార్యాలయ డివిజన్ ఇన్స్పెక్టర్ లుర్ధు, తహసిల్దార్ వివేక్ మాట్లాడుతూ..గత 90 సంవత్సరాలుగా మన తెలంగాణ రాష్ట్రంలో భూములకు ఎలాంటి సర్వేలు నిర్వహించలేదని తెలిపారు. ఆ కాలంలో నిజాం రాజులు ఈ సర్వే మొదలుపెట్టడం జరిగిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో భూముల రీ సర్వే నిర్వహించడం మొదలుపెట్టారని తెలిపారు. గ్రామంలో మొత్తం ఎంజాయ్మెంట్ సర్వే చేసి ఉక్కులు ఇవ్వడం జరుగుతుందన్నారు. మీకు ఎలాంటి సమస్యలు లేకుండా మండల సర్వేయర్ ఆధ్వర్యంలో లైసెన్స్ సర్వేయర్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, గ్రామంలో ఇంచు భూమి వదలకుండా సర్వే చేసి మీకు పట్టా పాస్బుక్కులు ఇవ్వడం జరుగుతుందన్నారు. అడవి భూములు ఉన్న, ఆర్ ఓ ఆర్ పట్టాలు ఉన్న, గత కొన్ని సంవత్సరాలుగా మీకు పట్టా లేని భూములు, పార భూములకు రిజిస్ట్రేషన్ ఇలాంటి సమస్యలకు ఈ భూముల రీ సర్వే చాలా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భూ రికార్డుల సర్వే కార్యాలయ డివిజన్ ఇన్స్పెక్టర్ లూర్ధు, మండల తహసిల్దార్ వివేక్, మండల సర్వేయర్, గ్రామ సర్పంచ్ భారతమ్మ, జిపిఓ పుష్పలత, ఏఈఓ సాయి చరణ్, ఉపసర్పంచ్ జనార్దన్, వార్డ్ మెంబర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




# అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం..

కేసముద్రం జూలై 3(ప్రభాత గమనం): కేసముద్రం మండలం రంగాపురం గ్రామంలోని అంగన్ వాడీ కేంద్రం-1 లో శుక్రవారం గర్భిణీ స్త్రీలకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గర్భిణీ స్త్రీ పప్పుల ఉమారాణి కి ఘనంగా సీమంతం నిర్వహించి గర్భిణీ స్త్రీలు తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కందునూరి భారతమ్మ, ఉప సర్పంచ్ మాలోత్ జనార్ధన్,గ్రామ పెద్దలు కందునూరి మహేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల శ్రీధర్, అంగన్ వాడీ టీచర్ కన్న జయమ్మ, ఆశా వర్కర్ ఎం. స్వరూప, పాఠశాల ఉపాధ్యాయ బృందం తో పాటు పలువురు గర్భిణీ స్త్రీలు,బాలింతలు, గ్రామ పెద్దలు, పలువురు చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.



# అవాస్తవాలను ప్రచారం చెయొద్దు

- ఇందిరమ్మ లబ్ధిదారులను మేస్త్రీలు ఇబ్బందులకు గురి చేయడం లేదు
- తప్పుడు ఆరోపణలు మానుకోకపోతే ఆందోళనలు చేస్తాం
- భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తాడబోయిన శ్రీశైలం

**కేసముద్రం జులై 3(ప్రభాత గమనం):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారులను మేస్త్రీలు ఎలాంటి ఇబ్బందులకు గురి చేయడం లేదని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తాడబోయిన శ్రీశైలం స్పష్టం చేశారు. శుక్రవారం కేసముద్రం మండల కేంద్రంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు...మేస్త్రీలు లబ్ధిదారులను ఇబ్బందిపెడుతున్నారనే ప్రచారాన్ని ఆయన ఖండించారు. వాస్తవానికి లబ్ధిదారులే పనులు చేయించుకున్న తర్వాత మేస్త్రీలకు సకాలంలో కూలీ చెల్లించడం లేదని పేర్కొన్నారు. అయినప్పటికీ ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా మానవతా దృక్పథంతో పనులు కొనసాగిస్తున్నామని, తమ వద్ద పనిచేసే రోజువారీ కూలీలకు సొంత డబ్బులతోనే వేతనాలు చెల్లిస్తున్నామని తెలిపారు. ఒకేసారి వందల సంఖ్యలో ఇళ్లు మంజూరు కావడంతో నిర్మాణ కార్మికుల కొరత ఏర్పడి కొన్ని చోట్ల పనులు ఆలస్యమవుతున్నాయని చెప్పారు. అలాంటివారు ఒకరిద్దరూ ఫిర్యాదు చేస్తే అందరూ మేస్త్రీలకు దాన్ని ఆపాదించడం సరికాదని అన్నారు. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా మేస్త్రీలపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని, ఇలాంటి ప్రచారాన్ని వెంటనే విరమించుకోవాలని ఆయన కోరారు. ఈ ఆరోపణలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో తమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374